ప్రజాశక్తి

శనివారం 15 జూన్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

స్వచ్ఛందంగా రక్తదానం చేయండి: జేసీ

5లో

ప్రకాశం, బాపట్ల జిల్లాలకు

కీలక మంత్రిత్వ శాఖలు

- గొట్టిపాటికి విద్యుత్ శాఖ..
- డిబిఎన్ స్వామికి సాంఘిక, సంక్షేమ శాఖ..
- అనగాని సత్యప్రసాద్‌కు రెవెన్యూ శాఖ కేటాయింపు..

మంత్రిత్వ శాఖల కేటాయింపు అనంతరం సిఎం చంద్రబాబును కలిసిన మంత్రులు గొట్టిపాటి, అనగాని, డిబిఎన్ స్వామి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని తమ నియోజకవర్గాల నుంచి వరుస విజయాలు సాధించి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన జిల్లాకు చెందిన సీనియర్ శాసనసభ్యులు రాష్ట్ర మంత్రివర్గంలో కీలక మంత్రిత్వ శాఖలు పొందారు. శుక్రవారం ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు తన మంత్రివర్గ సభ్యులకు శాఖలను కేటాయించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ని విద్యుత్ శాఖ మంత్రిగా, కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామిని సాంఘిక, సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, సచివాలయం, గ్రామ వాలంటీర్ల శాఖల మంత్రిగా, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ను రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖల మంత్రిగా నియమించారు.

ఈ ఎన్నికల్లో బాపట్ల జిల్లాలో ఉన్న ఆరు శాసనసభ స్థానాలనూ, ప్రకాశం జిల్లాలో ఉన్న ఎనిమిది స్థానాల్లో ఆరింటిని టిడిపి కైవశం చేసుకుంది. దరిశి, ఎర్రగొండపాలెం స్థానాలు కూడా కొద్ది ఓట్ల తేడాతోనే టిడిపి కోల్పోయింది. మొదటి నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లా ▶ 2లో

మెరుగైన వైద్యం అందించాలి: ఉగ్ర

ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాల కొరత పట్ల వైద్యాధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి-కనిగిరి

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యం అందించి ప్రజల్లో నమ్మకం కలిగించాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. కనిగిరి ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాలు సరిగా లేకపోవడంతో వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాశాలకు డయాలసిస్ కోసం వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా రాత్రి సమయంలో రోగులు దూర ప్రాంతానికి వెళ్లేందుకు వాహన సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గతంలో డయాలసిస్ కేంద్రంలో జనరేటర్ వసతి లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో తిరిగి అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. నెఫ్రాలజీ, రేడియాలజీ, మత్తు డాక్టర్‌ను తీసుకొచ్చి వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళల వార్డులో చిన్న పిల్లలకు ఊయల లేకపోవడం గమనించి ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రి గదులన్నీ తిరిగి పరిశీలించారు. ఆక్సిజన్, వాటర్ ప్లాంట్ పరిశీలించి వినియోగంలోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. తిరిగి మరోసారి తనిఖీ వచ్చేటప్పటికి రోగులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సౌకర్యాల కొరతపై వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

థామస్‌ను సత్కరిస్తున్న జిజిహెచ్ సూరింటెండెంట్

థామస్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: ఇప్పటివరకు 70 సార్లు రక్తదానం చేసి, 20 బ్లడ్ క్యాంపులు నిర్వహించి, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎంఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, హ్యూమన్ రైట్స్ ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు థామస్ మక్కెనని రక్తదాన దినోత్సవం సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం థామస్ మక్కెన మాట్లాడుతూ 1993 నుంచి 31 సంవత్సరాలుగా తాను రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా థామస్‌ను రిమ్స్ కాలేజ్ ప్రిన్సిపల్ సుధాకర్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న, ల్యాబ్‌టెక్నీషియన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకాశం, బాపట్ల జిల్లాలకు
కీలక మంత్రిత్వ శాఖలు

(మొదటిపేజీ తరువాయి)

టిడిపికి బలమైన జిల్లాగా ఉంది. ఈ ఎన్నికల్లో కూడా ఆ విషయం రుజువు కావడమే కాకుండా అందరూ మంచి మెజారిటీలతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో ప్రకాశం, బాపట్ల జిల్లాలకు మూడు మంత్రి పదవులు రావడమే కాకుండా కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కాయి. అద్దంకి నుంచి గతంలో పలువురు సీనియర్లు శాసనసభ్యులుగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. మార్టూరు నుంచి ఒకసారి, అద్దంకి నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన గొట్టిపాటి రవికుమార్ మొదటిసారిగా మంత్రి అయ్యారు. వైసిపి ప్రభుత్వంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఇదే శాఖ మంత్రిగా వ్యవహరించడం గమనార్హం. రవికుమార్ పెదనాన్న అయిన గొట్టిపాటి హనుమంతరావు 1994లో మార్టూరు అసెంబ్లీ నుంచి గెలిచి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఏర్పడిన మంత్రివర్గంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా భాధ్యతలు చేపట్టారు. అనంతరం ఇంతకాలం తరువాత అదే చంద్రబాబు నాయకత్వంలో రవికుమార్ మంత్రి కావడం గమనార్హం.

కొండపి ఎమ్మెల్యేగా హాట్రిక్ విజయం సాధించిన డోలా బాలవీరాంజనేయస్వామికి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యమైన మంత్రిత్వ స్థానాలను కేటాయించారు. సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, సచివాలయాల పాలన, గ్రామ వాలంటీర్ల శాఖల మంత్రిగా వ్యవహరించనున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటయిన సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ పాలనా వ్యవహారాల్లో ముఖ్యమైందిగా ఉంది. టిడిపి ప్రభుత్వ హయాంలో కొన్ని సవరణలు వచ్చే అవకాశం ఉన్న క్రమంలో కొత్త మంత్రి బాలవీరాంజనేయస్వామికి సిఎం గురుతర బాధ్యతలను అప్పజెప్పినట్లయింది.

బాపట్ల జిల్లాలోని రేపల్లె నుంచి టిడిపి అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో హ్యాట్రిక్ విజయం సాధించిన అనగాని సత్యప్రసాద్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ముఖ్యమైన శాఖ బాధ్యతలను అనగానికి అప్పజెప్పారు. కీలకమైన మంత్రిత్వ శాఖలను చేపడుతున్న ముగ్గురు మంత్రులూ ప్రకాశం, బాపట్ల జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం: బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని స్థానిక ఎస్‌టి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటరామిరెడ్డి అన్నారు. సిఎస్ పురంలో బడి ఈడు పిల్లలను గుర్తింపు కార్యక్రమం చేపట్టారు.

'ఉపాధి' కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి-మద్దిపాడు

ఉపాధి హామీ పనులను కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఉపాధి హామీ కార్యాలయంలో టిపి సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడాది ఉపాధి కూలీలు 100 రోజుల పని దినాలను సక్రమంగా ఉపయోగించుకోలేదని అన్నారు. పనులు నెమ్మదిగా సాగుతున్నాయని వాటిని కొనసాగించాలని అన్నారు. అదేవిధంగా మేట్‌ల పద్ధతిని కొనసాగించాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కొంగాల చిన్న ఉన్నారు.

రక్తదాతలకు అభినందనలు

డాక్టర్ కనకదుర్గ

ప్రజాశక్తి-మార్కాపురం: మానవ సేవ మాధవ సేవ అని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మార్కాపురం బ్రాంచి చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాతలకు ఆమె శుక్రవారం అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రక్తదాతలుగా యువత మరింతగా ఆసక్తి చూపాలని ఆమె కోరారు.

ఆదర్శ పాలన సాగిస్తున్న చంద్రబాబు: బీఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సిఎం చంద్రబాబు గత ఎన్నికల ముందు ప్రజల కిచ్చిన ఐదు హామీల అమలు మీద మొదటి సంతకం పెట్టి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ అన్నారు. ఒంగోలులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఐఐటి పరీక్షల్లో పొదిలి విద్యార్థికి ర్యాంకు

ప్రజాశక్తి-పొదిలి

గణేష్

ఐఐటి పరీక్షల్లో పొదిలి విద్యార్థి సత్తా చాటారు. విశ్వనాథపురంలోని పవన్ మెడికల్ షాప్ యజమాని దేసు త్రినాథ్-అనంత లక్ష్మి దంపతుల కుమారుడు గణేష్ 2024 ఐఐటి పరీక్షల్లో దేశంలోనే 253వ ర్యాంకు, మెయిన్స్‌లో 45వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి తెలంగాణ ఎంసెట్‌లో 53వ ర్యాంకు, ఆంధ్ర ఎంసెట్‌లో 229వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి గణేష్‌ను, వారి తల్లిదండ్రులను స్థానిక ప్రముఖ న్యాయవాది వరికూటి నాగరాజు, నాగేశ్వరరావు, ఆర్ఎంపి వైద్యులు భాస్కరరావు, మిలిటరీ శ్రీను, టీవీ షోరూం అధినేత హరిబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు, కాసాని రాము, S/o. వెంకటేశ్వర్లు, R/o. 1-43-5, గాంధీ నగర్, 25వ వార్డు, చీరాల పట్టణం, బాపట్ల జిల్లా వారి నుండి సంజయిపీ పొంది జారీ చేస్తున్న ప్రకటన.

నా క్లయింటు తనకు చెందిన దిగువ పేర్కొన్న 1వ షెడ్యూలు ఆస్థికి సంబంధించి గతంలో అనగా తేదీ 17- 05-2023 న శ్రీ పడవల ప్రభాత్ జగన్, S/o. పడవల వెంకటేశ్వరరావ్, R/o. ఈపూరు పాలెం గ్రామం, చీరాల మండలం అను వారికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రాయించి, చీరాల SRO గారి ఆఫీసులో డాక్యుమెంట్ నంబర్ 4560/2023 గా రిజిస్టర్ చేయించినారు. అలాగే దిగువ పేర్కొన్న 2వ షెడ్యూలు ఆస్థికి సంబంధించి గతంలో అనగా తేది.10-08-2023ని శ్రీ జాలాది వెంకటేశ్వర్లు, S/o. నరసింహరావ్, R/o. పొలిమేర రోడ్, చీరాల అను వారికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రాయించి, చీరాల SRO గారి ఆఫీసులో డాక్యుమెంట్ నంబర్ 7529/2023 గా రిజిస్టర్ చేయించినారు.

కాగా నా క్లయింటు వ్యక్తిగత కారణాలతో దిగువ పేర్కొన్న 1వ మరియు 2వ సెడ్యూల్ ఆస్థులకు సంబంధించిన శ్రీ పడవల ప్రభాత్ జగన్, శ్రీ జాలాది వెంకటేశ్వర్లు లకు ఇచ్చిన పైన ఉదహరించిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలను రిజిస్టర్ రద్దు దస్తావేజుల ద్వారా రద్దు చేయించదలచి ఉన్నారు. కావున దిగువ 1వ మరియు 2వ షెడ్యూళ్ళకు సంబంధించి సంబంధించి ఎవరైనా పైన తెలిపిన శ్రీ పడవల ప్రభాత్ జగన్, శ్రీ జాలాది వెంకటేశ్వర్లు గారినుండి ఈ ప్రకటన ఇచ్చిన నాటికి ఎటువంటి అగ్రిమెంట్లు చేయించుకుని ఉన్న యెడల, ఈ ప్రకటన ఇచ్చిన 15 రోజులలో నాకు గానీ నా క్లయింటుకు గాని రాత పూర్వకంగా తెలియపరచగలరు. ఈ రోజునుండి పైన తెలిపిన శ్రీ పడవల ప్రభాత్ జగన్, శ్రీ జాలాది వెంకటేశ్వర్లు గారితో దిగువ 1వ మరియు 2వ షెడ్యూళ్ళ కు సంబంధించి ఎటువంటి లావా దేవీలు, అగ్రిమెంట్లు జరపరాదని, అట్లు జరిపిన యెడల అవి యేవి చెల్లనేరవని, నా క్లయింటును బద్ధపరచజాలవని ఇందుమూలముగా యావత్ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

1వ షెడ్యూలు: లోగా ప్రకాశం జిల్లా, ఇప్పటి బాపట్ల జిల్లా, చీరాల స. డి., చీరాల మండలం, చీరాల శివారు, కొత్తపాలెం పంచాయితీ, చీరాల గ్రామ తాలూకా సర్వే నంబర్ 167/2 య.1-30 సెంట్ లలో ఇండ్లు లేని ప్రాంతం భూముల మధ్య యేరియా లోని య.0-63 సెంట్‌ల లో య. 0-40 సెంటీల స్థలమునకు హద్దులు.

తూర్పు : దండు బాట రోడ్డు పొద్దు
దక్షిణం : నా నిలువ స్థలం హద్దు,
పడమర : డొంక హద్దు
ఉత్తరం : కొల్లిపర పాండు రంగారావు గారి భూమి హద్దు

ఈ హద్దుల మధ్య గల 1936 చదరపు గజాల స్థలం లేక 1618 చదరపు మీటర్ల ఖాళీ స్థలం, ఈ స్థలము నకు తూర్పున గల దండు బాట రోడ్డు ద్వారా పడమరన గల డొంక ద్వారా మామూలుగా రాక పోకలు చేయు హక్కులున్ను, యావత్తు యిజ్మెంట్ హక్కులన్నూ సహా,

2వ షెడ్యూలు: లోగా ప్రకాశం జిల్లా, ఇప్పటి బాపట్ల జిల్లా, చీరాల స, డి., చీరాల మండలం, చీరాల శివారు, కొత్తపాలెం పంచాయితీ, చీరాల గ్రామ తాలూకా సర్వే నంబర్ 167/2 య. 1-30 సెంట్ లలో ఇండ్లు లేని ప్రాంతం భూముల మధ్య యేరియాలోని య.0-63 సెంట్‌లలో 879.8 చదరపు గజాల స్థలమునకు హద్దులు.

తూర్పు : సాతులూరి శివ పార్వతి స్థలం హద్దు
దక్షిణం : జాలమ్మ గుడి స్థలం హద్దు
పడమర : డొంక హద్దు
ఉత్తరం : 1వ షెడ్యూలు భూమి హద్దు

ఈ హద్దుల మధ్య గల 879.8 చదరపు గజాల స్థలం లేక 735.51 చదరపు మీటర్ల ఖాళీ స్థలం, ఈ స్థలము నకు తూర్పున గల దండు బాట రోడ్డు ద్వారా పడమరన గల డొంక ద్వారా మామూలుగా రాక పోకలు చేయు హక్కులున్ను, యావత్తు యిజ్మెంట్ హక్కులన్నూ సహా.

సం//
అసాది సతీష్‌రెడ్డి, BA, LLB, అడ్వకేట్,
ఆఫీస్ : రూమ్ నంబర్ 44, జంజనం కాంప్లెక్స్ (వెనుక వైపు)
గడియార స్తంభం సెంటర్, చీరాల, సెల్:7207775356

మహారాజశ్రీ గుంటూరు 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P.No.67/2023

Between
కుందూరు హేమసాయి అలియాస్ యేనుగంటి హేమసాయి ...పిటీషనర్/వాది
ఎదిరి
కుందూరు శ్రీనివాసరెడ్డి ...రెస్పాండెంటు/ప్రతివాదిటు

కుందూరు శ్రీనివాసరెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి, డోర్ నెం.2-41, తర్లుపాడు, చెన్నంరెడ్డిపల్లె మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో యిందలి పిటీషనరు విడాకులు మంజూరు కొరకు దాఖలు చేయగా, రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తము శ్రీయుత 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, గుంటూరు నందు పిటీషన్ దాఖలు చేయగా శ్రీయుత కోర్టు వారు H.M.O.P.No.67/2023 నందు ఎన్నిసార్లు నోటీసు పంపిననూ కాలాయాపన చేస్తూ తీసుకొననందున నీకు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు చేయమని ఆర్డరు ఇచ్చియున్నారు. సదరు ఆర్డరు ప్రకారము ది.08-07-2024వ తేదీన ఉదయం గం.10-30 నిమిషములకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచటమైనది.
వాయిదా ది.08-07-2024

ఇట్లు
దాసరి చిట్టిబాబు,
జి.జోజప్ప,
పిటీషనరు తరపున న్యాయవాదులు,
గుంటూరు.

మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS NO : 756/2022

బత్తుల గోవర్ధన రెడ్డి ...వాది
మరియు
గుంటుపల్లి సునీల్ కుమార్ వగైరాలు.. ప్రతివాదులు

To
D2
పల్లపోతు వెంకటేశ్వర్లు, తండ్రి మల్లికార్జున స్వామి, గుర్రం వారి వీధి, ఇంటి నెంబర్ : 29-1-24, ఒంగోలు పట్టణం.

పై నెంబర్ దావా లో రెండో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు కావున కోర్టు వారు మీకు నోటిసు నిమిత్తం తేది 20-6-2024 కు వాయిదా వేసియూన్నారు సదరు తేది ఉదయం గం 10.30 నిమిషాలకి పై తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు నుతెలియపరచుకోవాల్సింది లెని యెడల మీ పరోక్షమున దావాను విచారించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శిరిగిరి రంగారావు
వాది తరపు న్యాయవాది
ఒంగోలు

మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA NO : 553/2022
In
OS NO : 756/2022

బత్తుల గోవర్ధన రెడ్డి ... పిటిషనరు
మరియు
గుంటుపల్లి సునీల్ కుమార్ వగైరాలు.. రెస్పాండెంట్స్

To
R2
పల్లపోతు వెంకటేశ్వర్లు,తండ్రి మల్లికార్జున స్వామి, గుర్రం వారి వీధి, ఇంటి నెంబర్ : 29-1-24, ఒంగోలు పట్టణం.

పై నెంబర్ పిటిషన్ లో రెండో రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు కావున కోర్టు వారు మీకు నోటిసు నిమిత్తం తేది 20-6-2024 కు వాయిదా వేసియూన్నారు సదరు తేది ఉదయం గం 10.30 నిమిషాలకి పై తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు నుతెలియపరచుకోవాల్సింది లెని యెడల మీ పరోక్షమున పిటిషన్ ను విచారించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శిరిగిరి రంగారావు
వాది తరపు న్యాయవాది
ఒంగోలు

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఒ

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలం హనుమాన్‌జంక్షన్ (కుంట) గ్రామంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి బుజ్జిబాయి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సీడు ఫెర్టిలైజర్ లైసెన్సులు, బిల్ పుస్తకాలు పరిశీలించారు. అనంతరం ఎరువుల షాపు డీలర్లతో మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా నాణ్యత గల విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందజేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. ఎరువుల షాప్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని ఎన్‌ఎపి చెరువు వద్ద సరదాగా ఈతకు వెళ్లి పదో తరగతి చదివిన విద్యార్థులు ఇద్దరు మృతి చెందారు. శుక్రవారం ఈ ఏడాది దర్శిలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన ఇద్దరు విద్యార్థులు దర్శి మండలం లంకోజీనపల్లి పంచాయతీలోని లోదగిరి కాలనీకి చెందిన బొందల నవీన్(16), కొనకనమిట్ల మండలం వద్దిమడుగు గ్రామానికి చెందిన వసంతపురం చందు(16) ఇద్దరు సరదాగా ఈతకు వెళ్లి నీటిలో మునిగి మతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. గురువారం ఇద్దరూ కలిసి ఎన్‌ఎపి చెరువులో ఈతకు వెళ్లి శుక్రవారం శవాలై తేలారు. అయితే కనిపించకుండా పోవడంతో వీళ్ల తల్లిదండ్రులు బాలశౌరి, చెన్నయ్య, కుటుంబ సభ్యులు వెతికినా కనిపించలేదు. చివరకు శుక్రవారం ఉదయం చెరువులో శవాలుగా బయటపడ్డారు. వీళ్ల ఇద్దరూ ఈతకు వెళ్లి ఉండి ఉండవచ్చని ఏఎస్‌ఐ రాంబాబు తెలిపారు. ఈ మృతదేహాలకు దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. బొందల బాలశివునికి నలుగురు కుమారులు కాగా నవీన్ ఆఖరివాడు. అదేవిధంగా వసంతపురం చెన్నయ్యకు ఇద్దరు కుమారులు కాగా చందు చిన్నవాడు. వీరి మరణంతో ఆ గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతి చెందిన విద్యార్థులు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న విఆర్‌ఎలు

వీఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

వీఆర్‌ఎల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్‌ఎల సంఘ నాయకులు ఒర్సు ఆంజనేయులు కోరారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆయన వీఆర్‌ఎల సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అశోక్‌రెడ్డితో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వీఆర్‌ఎలకు జరిగిన అన్యాయాలను గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో డిఏ కూడా తగ్గించి వీఆర్‌ఎలకు 18 వేల రూపాయలు చెల్లించామని చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా వీఆర్‌ఏలకు న్యాయం చేయాలని వీఆర్‌ఎల సమస్యలు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విఆర్‌ఎల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఎలు సిహెచ్ శ్రీనివాసులు, దుగ్గిపోగు నాగరాజు, శంకుల అల్లూరయ్య, పుల్లేటి ఇమాంబి, పద్మావతి, వెంకటయ్య, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్నికల అధికారిగా కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గిద్దలూరు

సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అభినందించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన నాటి నుంచి కౌంటింగ్ వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తతతో విధులు నిర్వహించినందుకు గాను ఆయన ఉత్తమ ఎఆర్‌ఓ ఎన్నికయ్యారు. గురువారం కొత్తపట్నంలోని నంబూరి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారుల అభినందన సభలో ఆయనకు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి గరుడ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు: ఎఒ

ప్రజాశక్తి-కొమరోలు

ప్రస్తుతం వ్యవసాయ శాఖలో 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు సబ్సిడీపై ఇస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కె రాజ్యశ్రీ తెలిపారు. కొమరోలులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 2024-25 ఫార్మర్ ఓరియంటెడ్ యాక్టివిటీ కింద ఖరీఫ్ సీజన్లో సాగు చేసే ప్రధాన పంటల లో అధిక దిగుబడి సాధించ డంలో ఎదురయ్యే సమస్యలను గుర్తిస్తారు. వాటిని అధిగమించేదుకు చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వి వెంకట శేషమ్మ మాట్లాడుతూ ప్రధాన పంటలలో ఆశించే పురుగులు, తెగుళ్ల వాటి నివారణ మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, మండలంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నగుడిపాడులో చోరీ

రూ.50 వేలు నగదు, మూడు సవర్ల బంగారం అపహరణ

ప్రజాశక్తి-దొనకొండ

మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చైదల కృష్ణారెడ్డి, ఆయన భార్య నాగలక్ష్మమ్మలు ఇంటికి తాళం వేసి వరండాలో పడుకున్నారు. దొంగలు వెనుక వైపున ఉన్న కిటికీ ఐరన్ గ్రిల్ తొలగించి లోపలకు ప్రవేశించారు. ముందువైపు తలుపునకు లోపల గడియపెట్టి వెనుకవైపు తలుపు తీసి బీరువాను సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లి పగులకొట్టి లోపలున్న రూ.50 వేల నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణం దొంగలించుకెళ్లారు. ఉదయం తలుపునకు లోపల గడిపెట్టి ఉండటం చూసి దొంగతనం జరిగినట్లు తెలుసుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంపత్‌కుమార్ సంఘటన ప్రదేశాను పరిశీలించి బాధితుడైన కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు క్లూస్‌టీమ్ సిబ్బంది సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలను సేకరించినట్లు సమాచారం.

దొంగలు పొలంలోకి తీసుకెళ్లి పగులకొట్టిన బీరువా

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సాయిలు

టిడిపిలో చేరిన వైసిపి సర్పంచి భర్త

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం రాచర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ భర్త సగినాల సాయిలు టిడిపిలో చేరారు. సాయిలు వైసిపి రాచర్ల మండల నాయకత్వంలో ప్రముఖ పాత్ర వహించారు. శుక్రవారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. అనంతరం సాయిలు ఎమ్మెల్యే సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

సుందరయ్య కాలనీలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట సుందరయ్య కాలనీలో అంగన్‌వాడీ పిలుస్తోంది. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. 3-5 సంవత్సరాల లోపు పిల్లలను వారి తల్లిదండ్రులు అంగన్‌వాడీ సెంటర్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి రమా కోరారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య లభిస్తుందని సూపర్‌వైజర్ రమా తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కలిసిన ఉద్యోగులు

ప్రజాశక్తి-గిద్దలూరురూరల్

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గిద్దలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి నాగజ్యోతి గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతోపాటు నియోజకవర్గంలోని పశు వైద్య శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి

జగన్ కలిసిన మాజీ మంత్రి నాగార్జున

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని వారి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాజీ మంత్రివర్యులు డాక్టర్ మేరుగు నాగార్జున కలిశారు. మర్యాదపూర్వకంగానే ఈ భేటీ సాగినట్లు తెలిసింది.

ఉపాధి హామీ పనులు కొనసాగించాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వ్యవసాయ పనులు ప్రారంభమయ్యేదాకా ఉపాధి హామీ పనులను కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ డీఎస్‌వి ప్రసాద్, ఏపీవో వాసంతిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి పనులు మధ్యలో ఆగిపోవడం వలన వ్యవసాయ కూలీలకు ఇతర పనులు లేకపోవడం వలన జీవనం గడవటం కష్టంగా మారిందని వెంటనే తిరిగి ఉపాధి పనులను ప్రారంభించాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, పెట్రోలు డీజిల్ ధరల కారణంగా కుటుంబ ఖర్చులు పెరుగుతున్నాయని అన్నారు. దానికనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయలను బడ్జెట్లో కేటాయించాలని, రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈదర సుబ్బారావు దారా సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంపిడిఓ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వ్యకాసం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఆశా వర్కర్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పొదిలి

జూన్ 30, జులై 1 తేదీల్లో పొదిలిలో జరిగే ఆశా వర్కర్స్ జిల్లా క్లాసులను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఐవి రాఘవమ్మ కోరారు. శుక్రవారం పొదిలిలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా క్లాసుల జయప్రదానికి సన్నాహకంగా యూనియన్ నాయకురాలు ఎస్ పద్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లపై రోజూ పనిభారం పెరుగుతోందని అన్నారు. ఆశాల సమస్యలపై చర్చించటానికి జరిగే జిల్లా క్లాసుల్లో ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆశాల పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. ఆశాలకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ పొదిలి, మర్రిపూడి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నాయకులు ఎం పరిశుద్ధం, కె పద్మ, శారద, సుల్తానమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు రాఘవమ్మ



ఎమ్మెల్యే దామచర్లతో కొల్లా మధు

దామచర్లను కలిసిన కొల్లా మధు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సిటిజన్ ఫోరమ్ అధ్యక్షులు కొల్లా మధు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా దామచర్ల ఎన్నికైన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంఎల్ఏ కొండయ్య

రక్తదానంలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - చీరాల

రక్తదానం చేయడం వలన శరీరంలో నూతన రక్తం ఉత్పత్తి చెంది మంచి ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరు రక్తదానంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా వైద్యశాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరం ఆయన ప్రారంభించారు. అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో విలువైనదని అన్నారు. అత్యవసర సమయాల్లో అవసరమైన రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కావున ప్రతి ఒక్కరు మానవత్వంతో రక్తదానం చేయాలని కోరారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం కాంప్రహెన్సీ క్యాన్సర్స్ కేర్ ట్రైనింగ్ నందు పాల్గొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటిండెంట్ డాక్టర్ సుభాషిని, వైద్యులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పేద విద్యార్థికి రోటరీ చేయూత

ప్రజాశక్తి - వేటపాలెం

పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం చదువుతున్న జాండ్రపేటకు చెందిన బండ్ల స్నేహప్రియకు వేటపాలెం రోటరీ క్లబ్ రూ.5వేల ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లి కుసుమ కుమారికి యుఎస్ఎన్ఆర్ఐ బట్ట తులసి శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో ఉత్తమ ఫలితాలు సాధించే పేద విద్యార్థులకు చేయూత అందించేందుకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బట్ట మోహనరావు, కార్యదర్శి ఎవి సురేష్ బాబు, కొత్త శ్రీనివాసరావు, వాసు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

హామీలకు కట్టుబడి పనిచేసే వ్యక్తి చంద్రబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తూనుగుంట్ల సాయిబాబా

రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను ముందుకు తీసుకు వెళ్లి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ముందుగా ఐదు అంశాలపై సంతకాలు చేయటం అభినందనీయం అన్నారు. నిరుద్యోగులకు బరోసా కల్పించే విధంగా మెగా డిఎస్సి, రైతుల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడం, అవ్వ, తాతల పెన్షన్ రూ.4వేలకు పెంచటం, పేదవారికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరించడం, నైపుణ్య గణనపై సంతకం చేయడం సుపరిపాలను శ్రీకారం చుట్టడమేనని అన్నారు. స్థానికంగా వివిధ శాఖల్లో జరిగిన అవినీతి అక్రమాలపై త్వరలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ద్వారా విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చంద్రబాబు ఆధీనంలో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీలకు తక్షణమే వేతనాలు ఇవ్వాలి

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఆగస్టిన్

ప్రజాశక్తి - వేమూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు తక్షణమే కూలీల నగదు విడుదల చేయాలని సిఐటియు మండల నాయకులు బి ఆగస్టిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల పని ప్రదేశన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు గ్రామంలోనే 600 మంది పైగా కూలీలు ఉండగా ప్రస్తుతం 50మందికి మించి పనులు జరిపించలేక పోతున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొందని అన్నారు. వేసవిలోనే కూలీలకు పనులు చూపించలేకపోతే వర్షాలు మొదలైతే ఉపాధి పనులు ఎక్కడా లభించే పరిస్థితి లేదని అన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యేవరకు జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు చూపించాలని డిమాండ్ చేశారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి పనులు చూపే విధంగా అనుమతులు ఇవ్వాలని కోరారు.

కొల్లూరు : ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు బి అగస్టిన్ ప్రభుత్వం కోరారు. మండలంలోని తాడిగరపాడులో ఉపాధి కూలీల పనిప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పేదలకు పనులు చూపించి ఉపాధి చూపాలని కోరారు. కార్యక్రమంలో మెట్ల శ్రీను, అర్జునరావు, శివ లీల పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సుబ్బారావు

గ్రామీణాభివృద్ధికి పవన్‌కల్యాణ్ కృషి చేయాలి

సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మోహన్

ప్రజాశక్తి - బాపట్ల

కార్యదర్శి కృష్ణ మోహన్

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి తోపాటు సర్పంచుల సమస్యల పరిష్కారానికి తొలిసారిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పదవి చేపట్టిన పవన్ కళ్యాణ్‌కు సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్ శుక్రవారం అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామ పంచాయతీలను తిరిగి మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించడం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎప్పుడు లేని విధంగా కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం పక్కదోవ పట్టించి పంచాయతీల్లో కనీసం సౌకర్యాలు, బ్లీచింగ్‌కు సైతం నిధుల్లేకుండా చేశారని అన్నారు. సచివాలయాలను తీసుకొచ్చి రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచులకు విలువ లేకుండా గత ప్రభుత్వం చేసిందని అన్నారు. పవన్ కళ్యాణ్ గతంలో సర్పంచుల సమస్యలపై రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సర్పంచులు, గ్రామీణ ప్రాంత సమస్యలను ఆయనకు వివరించి నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో పవన్ కళ్యాణ్ సంప్రదింపులు జరిపి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు రావల సిన నిధులు విడుదలకు కృషి చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్

- పట్టణంలో అపూర్వ స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు
- కాలినడకన ప్రజలకు అభివాదం చేసిన గొట్టిపాటి
- భారీగా తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి - అద్దంకి

గొట్టిపాటి రవికుమార్ భారీ మెజార్టీతో ఐదవ సారి ఎంఎల్ఏగా గెలుపొందారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార చేశారు. చంద్రబాబు మంత్రివర్గంలో గొట్టిపాటి రవికుమార్ రూపంలో అద్దంకి నియోజకవర్గానికి తొలిసారి మంత్రి పదవి దక్కింది. దీంతో వేల సంఖ్యలో టిడిపి శ్రేణులు, అధికారులు అభినందనలు తెలిపేందుకు చేరుకున్నారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి, బంగ్లా రోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో ప్రజలతో ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మంత్రి పదవి దక్కిన సందర్భంగా గొట్టిపాటి రవికుమార్‌కు అభినందనలు తెలిపారు. అద్దంకి నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఉద్దండులు శాసన సభ్యులుగా ఎన్నికైనప్పటికి మంత్రి పదవి దక్కలేదు. గొట్టిపాటి రవికుమార్ రూపంలో మంత్రి పదవి రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత గొట్టిపాటి రవికుమార్‌కు విద్యుత్ శాఖ కేటాయిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. దీనితో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మూడు చక్రాల స్కూటర్ అందజేసిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - పంగులూరు

స్కూటర్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన నీలం హనుమంతరావు అనే వికలాంగునికి మూడు చక్రాల స్కూటర్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అందజేశారు. హనుమంతరావుకు ఏడాదిన్నర క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. నడువలేని స్థితిలో ఉన్న ఆయన విషయం టిడిపి నాయకులు ఒకసారి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలైన తర్వాత మూడు చక్రాల స్కూటర్‌ను ఏర్పాటు చేద్దామని అప్పుడు హామీ ఇచ్చారు. శుక్రవారం చందలూరు వెళుతున్న మంత్రి రవికుమార్ మార్గమధ్యంలో కొప్పెరపాడులో ఆగి నీలం హనుమంతరావుకు మూడు చక్రాల స్కూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో గొల్లపూడి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ పెంట్యాల సుబ్బారావు, ఎ అశోక్, ఎ సూరిబాబు, విష్ణు, రావూరి అశోక్, వై స్టాలిన్ బాబు పాల్గొన్నారు.

మంత్రి రవికుమార్‌ను కలిసిన తెలుగు మహిళలు

మంత్రి గొట్టిపాటిని కలిసిన మహిళలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో తెలుగు మహిళ మండల నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళ కార్య నిర్వాహక కార్యదర్శి నాగబోతు సుజాత, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు కొనికి గోవిందమ్మ, సయ్యద్ గౌస్య, కొలసాని లీలావతి, గుమ్మా జ్యోతి పాల్గొన్నారు.

దశరథ రామయ్యకు నివాళి అర్పిస్తున్న గొట్టిపాటి

బెల్లంకొండకు నివాళి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు, తెలుగుదేశం నాయకుడు బెల్లంకొండ దశరథ రామయ్య చిత్రపటానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఘనంగా నివాళి అర్పించారు. గ్రామంలోని దశరథ రామయ్య ఇంటికి శుక్రవారం మధ్యాహ్నం మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గ్రామంలో తెలుగుదేశం అభివృద్ధికి దశరథ రామయ్య ఎంతో కృషి చేశారని అన్నారు. ఆటుపోట్లను తట్టుకొని పార్టీని నిలబెట్టడంలో ఆయన కృషి మరువలేనిది అన్నారు. తనకు చాలా కాలం నుండి దశరథ రామయ్యతో పరిచయం ఉందని అన్నారు. నిజాయితీ, గల వ్యక్తిగా ఆయన పని చేశారని చెప్పారు. ఆదర్శవంతమైన వ్యక్తిని కొనియాడారు. ఆయన కుటుంబానికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అంతకు ముందు గ్రామంలోని మహిళలు, టిడిపి కార్యకర్తలు గ్రామంలోని రామాలయానికి తీసుకువెళ్లి అక్కడ కొబ్బరి కాయలు కొట్టించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కరి వెంకట సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, పెంట్యాల రాధాకృష్ణ, పెంట్యాల రామలింగస్వామి, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేకర్, బోరెడ్డి ఓబులురెడ్డి, మాగులూరి రమేష్ బాబు, మాజీ సర్పంచ్ ఉన్నం రవి, జాగర్లమూడి సుబ్బారావు (జెకెసి), గరిమిడి జగన్ మోహనరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న వాలంటీర్లు

కొండయ్యకు వాలంటీర్ల సత్కారం

ప్రజాశక్తి - చీరాల

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను పట్టణంలోని ఐదవ వార్డు కౌన్సిలర్ సూరగని లక్ష్మి, నరసింహారావు ఆధ్వర్యంలో ఆ వార్డులోని వాలంటీర్లు మర్యాద పూర్వకంగా స్థానిక టిడిపి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గత ప్రభుత్వంలో తమ వార్డులో పలువురు వాలంటీర్లు వైసీపీ నాయకుల ఒత్తిళ్ళతో రిజైన్ చేసినప్పటికీ తమపై నమ్మకంతో మిగిలిన వాలంటీర్లు విధులకల్లో ఉన్నారని, వారికి తిరిగి అవకాశం కల్పించాలని కౌన్సిల్ సురగాని లక్ష్మి ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి తీసుకువచ్చారు. కొండయ్యను వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, టిడిపి ముఖ్య నేతలు కలసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

16 నుంచి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

పాత శింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి మొదలవుతున్న నేపథ్యంలో శుక్రవారం మంత్రి డాక్టర్ స్వామి గోడపత్రికను ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 24న ఉదయం కల్యాణం, సాయంత్రం రథోత్సవం జరుగుతుందని వివరించారు. ఈ నెల 19న పొట్టేళ్ల పందేలు, శ్రీకష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో బండలాగుడు రాథాడు పోటీలు జరుగుతాయని చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో దామచర్ల పూర్ణచంద్రరావు ఈవో పి.కష్ణవేణి, ముఖ్య అర్చకులు ఉదయగిరి వెంకటలక్ష్మీనరసింహాచార్యులు, పాలకమండలి సభ్యులు గోకరాజు పాపయ్యానాయుడు, టిడిపి కొండపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

16న జిల్లాకు రానున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-కొండపి

డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఈ నెల 16న మంత్రిగా తొలిసారి జిల్లాకు రానున్న నేపథ్యంలో ఘనంగా స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.రామయ్యచౌదరి తెలిపారు. 16న మధ్యాహ్నం మూడు గంటలకు చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి ఆంజనేయ స్వామి గుడిలో పూజా కార్యక్రమం అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా వల్లూరమ్మ తల్లి దేవస్థానం దగ్గరకు వస్తారన్నారు. సాయంత్రం 5 గంటలకు వల్లూరమ్మ తల్లి దేవస్థానంలో పూజా కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 6:30 గంటలకు నాయుడుపాలెం గ్రామంలోని దామచర్లవారిగూడెం వద్ద సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్‌ను జరుపుకోవాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఈ నెల 17న బక్రీదును ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి.శ్రీరామ్ సూచించారు. శుక్రవారం నాడు పట్టణంలో ఉన్న మసీదులు వద్దకు వెళ్లి ముస్లిం పెద్దలతో సమావేశమయ్యారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మసీదుల వద్ద, ఈద్గాల వద్ద బక్రీద్ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు షేక్ మహబూబ్‌బాషా, షేక్ బేగ్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయండి

- బ్లడ్ బ్యాంక్ ఆధునీకరణకు చర్యలు - జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆరోగ్యవంతులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్, మున్సిపల్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, మెడికల్ షాపుల సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు వందమందికి పైగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారికి ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణం పోసిన వారమవుతామన్నారు. ఈ దిశగా ప్రజలకు చైతన్యం కల్పించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో బ్లడ్ బ్యాంకును కూడా ఆధునీకరిస్తామన్నారు. రక్తదానం చేసిన వారిలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, ఇతర ఉద్యోగులు ఉన్నారు. రక్తదానం చేసిన డిఆర్ఓ ఆర్.శ్రీలత కుమారుడు యశ్వంత్‌ను జెసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఆర్.శ్రీలత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి రాఘవయ్య, బ్లడ్ బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహారావు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్ పాల్గొన్నారు.

రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జాయింట్ కలెక్టర్

రక్తదాతలకు ఘనసన్మానం

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అనేక సార్లు రక్తదానం చేసిన ఐదుగురు మహాదాతలను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి శుక్రవారం ఘనంగా సన్మానించారు. మెడికల్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమాల్లో వీరి సేవలను కొనియాడారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దుర్గాదేవి మాట్లాడుతూ మొత్తం సమాజానికే ఇటువంటి వారు ఆదర్శమన్నారు. వీరి స్ఫూర్తితో మరింత మంది అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. సన్మానం అందుకున్న వారిలో డాక్టర్ వివేకానందన్, సాయికల్యాణ్, ముత్యాల, ఎం.థామస్, జి.రమేష్, మోహిత్ శంకర్ ఉన్నారు. రక్తదాతలను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రావు అభినందించారు.

రక్తదాతలను సన్మానిస్తున్న జిజిహెచ్ అధికారులు

రైల్వే ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తా..

బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైల్వే ప్రయాణికుల సమస్యల పరి ష్కారానికి తన వంతు కృషి చేస్తానని బాపట్ల ఎంపీ తెన్నేటి కష్ణప్రసాద్ తెలి పారు. శుక్రవారం ఆయన బాపట్ల రైల్వే స్టేషన్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ ఉన్న ప్రయాణికులతో సమస్యల గురించి చర్చించారు. బాపట్ల రైల్వేస్టేష న్లో అమృత ప్రాజెక్టు ద్వారా అభివద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్లాట్‌ఫారాలు కొంత మేర అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. స్టేషన్ పరిసరాలల్లో చీకటి లేకుండా చూడాల్సి ఉందన్నారు. నిర్మాణ వ్యర్థాలను అక్కడ నుంచి తక్షణమే తొలగించాల్సి ఉందన్నారు. ఈ మేరకు స్థానిక రైల్వే అధికారులతో చర్చిస్తానన్నారు. బాపట్ల స్టేషన్లో ఉన్న ఐదు ప్లాట్ ఫారాలను వినియోగంలో తెచ్చే దిశగా కషి చేస్తానన్నారు. ప్రతి రోజూ చీరాల, బాపట్ల నుంచి గుం టూరు, విజయవాడకు ఉద్యోగులు రైళ్ల ద్వారా ప్రయాణం చేస్తున్నారని, అయితే వారికి ఇం టర్ కనెక్టివిటీ ట్రైన్లు లేకపోవడంతో రాక పోకలకు కష్టంగా ఉన్నట్లు తన దష్టికి వచ్చిందన్నారు. ఈ సమస్య పరిష్కారాన్ని కషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల లో పలు సూపర్ ఫాస్ట్ రైళ్ల నిలుపుదల చేసేందుకు రైల్వే శాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తానన్నారు. రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం బాపట్ల రైల్వేస్టేషన్లో రిజిస్టర్ పెట్టడం జరుగుతుందని, ప్రయాణికులు తమ సమస్యలను అందులో వివరించాలన్నారు. సమస్యలేవైనా నేరుగా తన దృష్టికి తేవచ్చన్నారు.

స్టేషన్‌లో పరిశీలిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

ఉగ్రకు శుభాకాంక్షలు చెబుతున్న మెప్మా సిబ్బంది

మహిళల అభివృద్ధికి కృషి: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని శుక్రవారం సాయంత్రం మెప్మా సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం కె.రఘు, సిబ్బంది సి సురత్న, దీప్తి, పట్టణ సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పి.మాలతి, కె.రాధమ్మ, వెంకటలక్ష్మి, హనీఫా పాల్గొన్నారు.

స్వామిని అభినందిస్తున్న పూర్ణచంద్రరావు, సత్య

మంత్రి స్వామికి అభినందనలు

ప్రజాశక్తి-కొండపి

సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రిగా పదవి చేపట్టిన డిబిఎన్ స్వామికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో టిడిపి నాయకులు నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, మండల యూత్ నాయకులు కాలేషా, చాగంటి శేషయ్య, తుళ్లూరి బాలచెన్నయ్య, కందిమళ్ల రమేష్, శంకర్, ఎల్.ఎన్.టి శ్రీను, దేవర, తదితరులు ఉన్నారు.

అచ్చెన్నాయుడుని కలిసిన దామచర్ల సత్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని విజయవాడలోని నివాసంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అచ్చెన్నాయుడుతో సత్య

కోర్టు ఆవరణలో కేక్ కట్ చేసిన న్యాయవాదులు

భూ హక్కు చట్టం రద్దు పట్ల న్యాయవాదుల హర్షం

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం 2023 రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలకు ముందు న్యాయవాదులు 100 రోజులకుపైగా ఉద్యమాలు, ఆందోళనలు చేశామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మురకొండ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా విరుద్ధమైన చట్టాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రద్దు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో కేక్ కట్ చేసి నూతన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరి రామకృష్ణారావు, పంచాగ్నుల ఉదయభాస్కర్, వడ్లవల్లి వీరనారాయణ, జి శ్రీనివాసరావు, మహిళా న్యాయవాదులు కాకాని నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు నాగ ఆంజనేయులు

భట్టిప్రోలు : ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఇబ్బందికరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయటం హర్షనీయమని సిపిఐ నాయకులు, న్యాయవాది పి నాగాంజనేయులు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన ఈ దుర్మార్గపు యాక్ట్ చట్ట విరుద్ధంగా ఉందని, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 3నెలల పాటు నిరవధిక నిరాహార దీక్షలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పేదలు, ఆ యాక్టును రద్దు చేస్తానని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం రద్దుకు సంతకం చేయడం అభినందనీయమని అన్నారు. సిపిఐ నాయకులు జి బాలాజీ మాట్లాడుతూ వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ పెంపుదల చేసేందుకు సంతకం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తారని ఆయన ఆశ బాగా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పర్చూరు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజే ఒకేరోజు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ రూ.4వేలకు పెంపు, అన్నా క్యాంటీన్ పునరుద్ధరణ, నైపుణ్య గణన ఐదు అంశాలపై సంతకాలు చేసిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి బొమ్మల సెంటర్లో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చీరాల

దండుబాట 33/11కేవి విద్యుత్ ఉపకెంద్రం పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 7.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డిఈఈ టి శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఉపకేంద్ర పరిధిలోని వైకుంఠపురం, విఠల్ నగర్, ఉజిలిపెట్, జయంతిపెట, రోశయ్య కాలనీ, కారంచేడు రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

అస్తవ్యస్త పురపాలనను గాడిలో పెడతాం

ఎంఎల్ఎ వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

మురికి కూపంగా మారిన మున్సిపాలిటీని పాలనను గాడిలో పెడతామని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు మున్సిపాలిటీ ఖజానాను ఖాళీ చేశారని అన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లలో పనిచేస్తే సహించేది లేదన్నారు. పట్టణంలో పారిశుధ్య పనులకు మాత్రమే వారిని వినియోగించాలని అన్నారు. ఇప్పటివరకు మున్సిపాలిటీలో పనులకు జెసిబిని అద్దె ప్రాతిపదికపై పనులు చేయించారు. అద్దె చెల్లించిన మొత్తంతో కొత్త జెసిబినే మున్సిపాలిటీకి సమకూర్చొచ్చని అన్నారు. మున్సిపాలిటీ ప్రక్షాళన చేసే దిశగా చర్యలు చేపడతామని అన్నారు. ఐదేళ్లుగా మూలబడిన అన్న క్యాంటీన్ భవనాన్ని శుభ్రం చేయించి అన్ని హంగులతో సౌకర్యాలు కల్పించి క్యాంటీన్ త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ప్రజలు, పాదాచారులకు ఇబ్బంది కలిగించే విధంగా రహదారులకు ఇరువైపుల ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు పెట్టే సంస్కృతికి స్వస్తి చెబుతామని అన్నారు. ఫ్లెక్సీల వల్ల ఎన్నో అనర్ధాలు జరుగుతున్నాయని అన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకొని రహదారికి ఇరువైపుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే అంశంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. అభివృద్ధిపైనే దృష్టి సారించి ముందుకు వెళ్తున్న తమ జోలికి ఎవరైనా వస్తే సహించి ఊరుకునేది లేదని వైసిపి వర్గాలను ఉద్దేశించి సున్నితంగా హెచ్చరించారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, తాతా జయప్రకాష్ నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, తోట నారాయణ, తానికొండ దయా బాబు, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివ నారాయణ, ఆంధ్రేయ, భీమా లీలాకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరేంద్రవర్మ

అధికారుల పనితీరు మెరుగుపరచుకోవాలి

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి - వేటపాలెం

వ్యవసాయ శాఖ అధికారుల పనితీరు మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. మండలంలోని అక్కయపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద మండల స్థాయి వ్యవసాయశాఖ సిబ్బంది (ఆర్బికె) ఇన్‌పుట్ డీలర్స్‌కు శిక్షణ నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా వ్యవసాయ శాఖ సిబ్బంది పనిచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రామకృష్ణ, చీరాల, వేటపాలెం మండలాల్లో సాగు చేసే విస్తీర్ణం, సాగు చేసే పంటలు, వివిధ అంశాల గురించి తెలిపారు. చీరాల ఎడిఎ నియోజకవర్గ స్థాయిలో పండే ప్రథమ పంటల గురించి వివరించారు. ఉద్యానవన పంటలను ఆ శాఖ అధికారి వివరించారు. మండలానికి కేటాయించిన భూసార పరీక్షల మట్టి నమూనాలు వీలైనంత తొందరగా తీసి పరీక్షకు పంపాలని చెప్పారు. డిఎటిటీసీ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఉషచ బాలమురళీధర్ నాయక్ మట్టి నమూనాలు ఎలా స్వీకరించాలో క్లుప్తంగా తెలిపారు. కార్యక్రమంలో డిడిఎ విజయనిర్మల, ఎడిఎ ఎఫ్రాయం, చీరాల, వేటపాలెం, చిన్నగంజం ఎఒలు, ఏఈఓలు, వీహెచ్ఎలు, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

విత్తన ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

సకాలంలో వర్షాలతో వ్యవసాయానికి సానుకూల వాతావరణంలో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ లక్ష్మి అన్నారు. స్థానిక ఎఒ కార్యాలయంలో ఖరీఫ్ సాగు సమాయత్తంపై వ్యవసాయ గ్రామ సహాయకులు, విస్తరణ అధికారులు, విత్తన, ఎరువులు, పురుగు మందుల షాపుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి పాటించాల్సిన జాగ్రత్తలపై డీలర్లకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఖచ్చితమైన ధరలకే విక్రయించాలని అన్నారు. అధిక ధరలకు విక్రయించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 90 శాతానికి మించి మొలక శాతం ఉంటేనే విక్రయించాలన్నారు. సాగుకు ముందే మట్టి నమూనాలను సేకరించాలన్నారు. నేలలో సేంద్రియ, కర్బనం పెంపొందించే పచ్చి రొట్టసాగు ప్రాధాన్యతను రైతులకు వివరించాలని అన్నారు. సమావేశంలో ఎఒ బి చంద్రశేఖర్, సాంకేతిక ఎఒ జయశ్రీ, ఎఈఓ సురేష్, గోపి యాదవ్ పాల్గొన్నారు.

అద్దంకి : రైతులను ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధం చేయడానికి గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్ధంగా ఉండాలని ఎడిఎ కె ధనరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, డీలర్లకు అవగాహన కల్పించారు. సాంకేతిక వ్యవసాయాధికారి తిరుమలరావు మాట్లాడుతూ డీలర్లు అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అమ్మాలని, రైతులకి అమ్మిన ప్రతి సరుకుకు రసీదు ఇవ్వాలని సూచించారు. ఎఒ కొర్రపాటి వెంకట కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు కొత్తగా వచ్చిన విత్తన రకాలు, పురుగు మందుల గురించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కొరిశపాడు ఎఒ పి శ్రీనివాసరావు, టెక్నికల్ ఎఒ మీరమ్మ, డీలర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడిఎ లక్ష్మి

అద్దంకిలో మాట్లాడుతున్న ఎడిఎ కె ధనరాజ్

అధ్వానంగా ఉన్న ఐలవరం, పెద్దవరం రహదారి

అధ్వానంగా పెద్దవరం రహదారి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రెండు మండలాలు, రెండు గ్రామాలను కలిపే ప్రధాన రహదారి ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ప్రజలకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఐలవరం నుండి నగరం మండలం పెద్దవరం గ్రామానికి ఉన్న రహదారిలో నిత్యం రెండు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారు. ఈ రహదారి గత పదేళ్లుగా అధ్వాన స్థితికి చేరింది. పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మోపిదేవి వెంకటరమణారావు మంత్రిగా ఉన్న రోజుల్లో అభివృద్ధి చేస్తారని ప్రజలు భావించారు. కానీ ఎలాంటి పనులు జరగలేదు. ప్రస్తుతం ఎన్నికైన ఎంఎల్ఎ నక్కా ఆనందబాబు అయినా రోడ్డు బాగు చేయిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఈ రహదారి మార్గం గుండా రేపల్లె నుండి ధూళిపూడి, పెద్దవరం, ఐలవరం, కనగాల మీదుగా చీరాల, గుంటూరుకు ఆర్టీసీ బస్సులు ప్రయాణించిన సంఘటనలు ఉన్నాయి. రెండు గ్రామాల మధ్య నిత్యవసరాల కోసం ప్రయాణాలు చేస్తుంటారు. ఎండైనా, వానైనా ఈ రహదారి మార్గం ద్వారానే ప్రయాణించాల్సి ఉంటుంది. ఐలవరం నుండి పెద్దవరం వరకు రైతులు, వ్యవసాయ కూలీలు కూడా వెళ్లాల్సి ఉంది. వర్షాకాలంలో రహదారి గుంటల్లో వర్షపు నీరు నిలబడి బురదమయంగా మారి నడవడానికి కూడా వీలులేని విధంగా ఉంటుంది.

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌పై ఆశలు

ప్రస్తుతం తెలుగుదేశం అధికారం చేపట్టి రేపల్లె శాసన సభ్యులు అనగాని సత్యప్రసాద్‌కు రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నగరం మండలం పెద్దవరం ప్రజలు ఈ రహదారి అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్వానంగా ఉన్న రహదారిపైనే ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు గమనించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని ప్రజలు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై నెల క్రితం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ నేటికీ కేసు నమో దు చేయలేదని బాధితుడు రాపూరి జానకి రామయ్య కెవిఎన్‌పిఎస్, ప్రజా సంఘాల నాయకులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని కామేపల్లి ఎస్టీ కాలనికి (యానాదులు) చెందిన రాపూరి జానకి రామ య్య గత కొన్ని నెలలుగా పుట్టావారిపాలెం, కామేపల్లి గ్రామాల మధ్య ఉన్న సిరి వెంచర్‌కు కాపలాదారునిగా పనిచేస్తున్నాడు. గత మే 14న ఎన్నికలు జరిగిన మరుసటి రోజు రాత్రి 9 గంటల సమయంలో కామేపల్లి గ్రామానికి చెందిన జాష్టిరామయ్య, శేషగిరిరావు, వినోద్ అనే ముగ్గురు మందు సేవించి వెంచర్ వద్దకు వెళ్లారు. వెంచర్ స్థలంలో కూర్చుని మందు తాగుతుండగా జానకి రామయ్య వారిని అడ్డుకున్నాడు. వెంచర్ స్థలంలో మందు తాగితే తన యజమాని తనను తిడతాడని జానకి రామయ్య వారిని అక్కడి నుండి వెళ్లాలని కోరాడు. దీంతో రెచ్చిపోయిన జాష్టి రామయ్య, శేషగిరిరావు, వినోద్ తమకే చెబుతావారా అంటూ జానకి రామయ్యను యానాది కులం పేరుతో దూషించి దాడి చేశారు. వారి దాడి నుండి తప్పించుకుని కాలినడకన కామేపల్లిలోని తమ కాలనీకి చేరుకున్నాడు. వెంటనే తన కొడుకుని వెంటబెట్టుకుని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఎస్ఐ పి సురేష్ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయకుండా పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నాడని కెవిఎన్‌పిఎస్, ప్రజాసంఘాల నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. రాపూరి జానకి రామయ్యను కులం పేరుతో దూషించి దాడి చేసిన జాష్టి రామయ్య, శేషగిరిరావు, వినోద్‌పై వెంటనే అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కెవిఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓ శ్రీనివాసరావు పోలీస్ ఉన్నతాధికారులను కోరారు.

మురుగు పారదు. చెత్త తొలగించరు

- ప్రభుత్వం మారిన పనితీరు మరేనా...?
- పట్టీ పట్టనట్లుగా మునిసిపల్ అధికారులు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కారంచేడు రోడ్డులో ముక్కు మూసుకొని ప్రయాణం

ప్రజాశక్తి - చీరాల

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది పట్టణంలో పారిశుధ్య పరిస్థితి. పట్టణంలోని వివిధ వార్డుల్లో చెత్త తొలగించడంలేదు. దీంతో ఆయా వార్డుల్లో ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఓవైపు వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పేరుకుపోయిన చెత్తనంతటిని రోడ్డు మీదకు తీసుకురావడంతో దుర్వాసన మరింతగా వెదజల్లుతుంది. పట్టణంలోని గోశాల, వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త తొలగించక పోవడంతో ఆ ప్రాంతవాసులు రోడ్ల వెంట ఉండే ఆవులు, కుక్కలు చెత్తను రోడ్డుపైకి తీసుకొస్తుండటంతో మరింత దుర్వాసన వస్తుంది. తెల్ల గాంధీ బొమ్మ సెంటర్‌లోని గంగమ్మ గుడి వద్ద కాలవలు పూడిక తీయడంలేదు. చెత్త తొలగించడం లేదని ఆ ప్రాంతం వాసులు అంటున్నారు. పట్టణంలో డ్రైనేజీ పారుదల అస్తవ్యస్తంగా ఉండడంతో విజిలిపేటలో రోడ్ల వెంట మురికి నీరు నిలబడి రోగాలకు నిలయంగా మారుతుంది. నిత్యం ఆ ప్రాంతవాసులు మురికి నీరు కాలువలు నిండిపోవడంతో బకెట్లతో నీరు తోడి బయట పారబోసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గోసాల వద్ద రోడ్డుపైన పేరుకుపోయిన చెత్త

మురుగునీరు పారుదల లేక చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడే పరిస్థితులు ఉన్నాయని, అందుకు ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక పోవటమేనని ఆ ప్రాంతం మహిళలు అంటున్నారు. పట్టణంలోని వివిధ హాస్పిటల్స్ నుండి చెత్త పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ఆ హాస్పటల్ బయట ఉన్న వ్యర్థాలను తొలగించడం మాత్రం అలసత్వం వహిస్తున్నారని కొందరు అంటున్నారు. చీరాల నుండి కారంచేడు వెళ్లే రహదారిలో మంచినీటి చెరువు ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు వేస్తూ మున్సిపల్ అధికారులు డంప్ యార్డును తలపిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకుంటేనే ప్రయాణం చేయగలిగిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. దారి పొడుగుతున్న దుర్వాసన వెదజల్లుతుంది. చనిపోయిన మూగజీవాల కళేబారాలు, ఇతర వ్యర్థాలుతో ముక్కులు పగిలేలా వస్తున్న దుర్వాసనతో ఆ మార్గంలో ప్రయాణించే ముందే ముక్కులకు కర్చీపులు కట్టుకోవాల్సిన పరిస్థితి ఉందని బాటసారులు, వాహనదారులు అంటున్నారు. దండుబాట రోడ్డులో పారిశుధ్యం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. డ్రైనేజీ పారుదల లేక మరుగునీరు ఇళ్లల్లోకి చేరుతుంది. ఆ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కాస్త వర్షం పడితే చాలు ఇళ్లల్లోకి మురికి నీళ్లు చేరే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మారిన ప్రభుత్వమైనా చీరాలలో పారిశుద్ధం పరిస్థితి మార్చుతుందా? అనే సందేహం ఆయా ప్రాంతవాసులు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పారిశుద్ధ్యం, డ్రైనేజీ పారుదల మెరుగుదలపై దృష్టి సారించి ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరుతున్నారు.

విజ్ఞాన భారతి కాలేజ్ ఎదురు రోడ్డుపై ఉన్న వ్యర్థాలు

మండల పాలకవర్గ అధ్యక్షుల పదవి కొనసాగేనా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశంకు ఘనవిజయం లభించింది. అప్పటివరకు వైసీపీలో ప్రధాన నాయకులుగా, పాలకవర్గ అధ్యక్షులుగా పనిచేసిన ప్రజా ప్రతినిధులు ప్రస్తుతం ఎటువైపు వెళ్ళాలనే మీ మాంసలో ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా వరికూటి అశోక్ బాబుకు అన్ని విధాల అండగా ఎంపిపి, జెడ్‌పిటిసి దూసుకుపోయారు. మరోసారి వైసిపి ప్రభుత్వం అధికారం చేపడుతుందనే దృక్పథంతో వీరు ప్రచారంలో నిమగ్నమై పని చేశారు. కానీ వారి ఊహలకు వ్యతిరేకంగా ఫలితాలు లభించడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగుదేశం ప్రభుత్వంలోని ముఖ్యమైన నాయకులు మండల పరిషత్తులో ఇప్పటి వరకు జరిగిన వివిధ పనులకు సంబంధించి నిధులు కేటాయింపులు, వాటి వినియోగం వంటి అంశాలపై సమాచార హక్కు ద్వారా సేకరించి దగ్గరించుకున్నారు. పార్టీ మారితే దీనిపై ఉన్నతాధికారుల ద్వారా విచారణ జరిపించి అవినీతి జరిగినట్లుగా తేలితే తగిన చర్యలు తీసుకునేందుకు కూడా సిద్ధమైనట్లు తెలిసింది. కాగా ఎంపీపీ, జడ్పిటిసిలో పదవీకాలం మరో 28 నెలల పాటు ఉండటంతో తెలుగుదేశంలో కలిసి ఉండకపోతే అన్ని విధాలు నష్టపోతామనే భావనతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే జడ్పిటిసి మారినట్లు ప్రచారం

వైసీపీలో జెడ్పిటిసిగా గెలుపొందిన వ్యక్తి తెలుగుదేశం అధికారం చేపట్టడంతో టిడిపిలో చేరుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. ఉమ్మడి గుంటూరు జెడ్‌పి చైర్మన్ ఎన్నికల ముందు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చంద్రబాబు సమక్షంలో చేరారు. టిడిపి గెలుపు పొందడంతో చైర్మన్ తమ పదవిని కొనసాగించుకుంటున్నారు. దీంతో చైర్మన్ ద్వారా జడ్పిటిసి టిడిపిలో కొనసాగించేందుకు ఆమెతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. జడ్పిటిసి బాటలోనే ఎంపీపీ కూడా టిడిపిలో చేరే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉంటే మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టలేననే భావనలో ఉన్నట్లు ప్రచారం ఉంది. ఇప్పటికే గడిచిన రెండున్నరేళ్ల కాలంలో ఎంపీపీగా సాధించిందేమీ లేకపోగా ఎలాంటి ఆదాయం లేకుండా పదవికే పరిమితం అయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని దృష్ట్యా అన్ని విధానాలు నష్టపోయినట్లుగా ఎంపీపీ అక్కడక్కడ నాయకుల వద్ద వాపోతున్నారు. ఉన్న రెండేళ్ల పదవి కాలమైనా అధికార టిడిపిలో ఉంటే ఎలాంటి సమస్య ఉండదని, ప్రొటోకాల్ కూడా లభిస్తుందని ఆలోచిస్తున్నట్లు నాయకులు చెబుతున్నారు. దీని దృష్ట్యా దగ్గరి పరిచయం ఉన్న తెలుగుదేశం నాయకుల ద్వారా టిడిపిలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తుంది.

భట్టిప్రోలు సర్పంచ్ కూడా ఇదే బాటలో

మండల కేంద్రమైన భట్టిప్రోలు మేజర్ పంచాయతీ సర్పంచి కూడా వైసీపీలో గెలుపొంది జగన్మోహన్‌రెడ్డి గెలుపుకు ఇటీవల అహర్నిశలు కృషి చేశారు. కానీ వైసిపి ఓడిపోవడంతో పరిస్థితి తారుమారైంది. పంచాయతీలో గడిచిన మూడు నెలల కాలంలో రూ.2.5కోట్లకుపైగా నిధులు దుర్వినియోగం జరిగిందని తెలుగుదేశం నాయకులు అన్ని ఆధారాలతో ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల విచారణ చేపట్టి పంచాయతీలో జరిగిన అవినీతిపై ఆధారాలు సేకరించారు. అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు హెచ్చరికలు చేస్తున్నారు. ఇదే జరిగితే తన పదవికి ముప్పు తప్పదని భావించిన సర్పంచి కూడా తన సన్నిహితుల ద్వారా ఎమ్మెల్యే ఆనందబాబును కలిసి టిడిపిలో చేరే విధంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆనందబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఏదేమైనా మరికొద్ది రోజుల్లో ఎంపీపీ, జడ్పిటిసి, భట్టిప్రోలు సర్పంచులు తెలుగుదేశంలో చేరనున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతుంది.

స్కూల్ ఆవరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించిన విద్యార్థులు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - చీరాల

పర్యావరణాన్ని కాపాడుట కోసం విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించే విషయంలో పాఠశాలలు ఎంతో కీలకమని ఎఆర్ఎం స్కూల్ హెచ్ఎం బి సాల్మన్‌రాజు అన్నారు. ఎకోక్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్‌లో భాగంగా పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా విద్యార్థులు చేపట్టారు. వారం రోజులపాటు పర్యావరణహిత జీవనశైలి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు నేషనల్ గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ పవని భాను చంద్ర మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై గాంధీ, ముత్యాల ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, మాధవి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి : ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

పారిశుద్యంపై మునిసిపల్ అధికారులు ప్రత్యేక ద్రుష్టి పెట్టి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మునిసిపల్ అభి వృద్ధిపై కొద్దిసేపు చర్చించారు. త్వరలోనే సమీక్ష సమా వేశం నిర్వహిస్తానని అన్నారు. అధికారులందరూ రికార్డులను సిద్ధం చేసుకోవాలని అన్నారు. డ్రైనేజి పారుదల, పారిశుద్యం సమస్యలు ఎప్పట ికప్పుడు పరిశీలించి మెరుగు పరచాలని అన్నారు. ముందుగా మునిసిపల్ అధికారులు పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ చక్రవర్తి, వేటపాలెం ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

మునిసిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

వరిగడ్డి వాములు దగ్ధం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ స్కూల్ రోడ్డులో 25ఎకరాల 4వరి గడ్డివాములు శుక్రవారం దగ్ధం అయ్యాయి. వార్డుకు చెందిన కొలుసు గోవిందు, శ్రీనివాసరావు, శివరామకృష్ణ, శ్రీనివాసరావుకు సంబంధించిన గడ్డివాములు వెల్డింగ్ షాప్ నుండి వెలువడిన నిప్పురవ్వలు పడి అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ప్రమాదంలో రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఫైర్ ఆఫీసర్ వై సాంబశివరావు తెలిపారు.

దుర్గమ్మ గుడికి బయలుదేరిన ముప్పవరం టిడిపి కార్యకర్తలు

కాలినడకన విజయవాడ దుర్గమ్మ గుడికి

ప్రజాశక్తి - పంగులూరు

ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం అత్యధిక స్థానాల్లో గెలుపొందటం, అద్దంకి శాసన సభ్యునిగా 5వ సారి గొట్టిపాటి రవికుమార్ గెలిచి మంత్రివర్గంలో స్థానం రావడంపై ఆనంద వ్యక్తం చేస్తూ ముప్పవరం తెలుగుదేశం కార్యకర్తలు విజయవాడ కనకదుర్గ గుడికి కాలినడకన బయలు దేరారు. ముప్పవరం జాతీయ రహదారి పక్కనున్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించి పాదయాత్ర ప్రారంభించారు. టిడిపి నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం విజయ బేరి మోగించిందని అన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఆనందంగా ఉన్నారని చెప్పారు. పాదయాత్రలో ముప్పవరం తెలుగుదేశం అధ్యక్షులు రౌతు వీరాంజనేయులు, యార్లగడ్డ సాంబశివరావు, ఇంటూరి వీరాంజనేయులు, తాత శ్రీను, మోహనకృష్ణ, హర్ష, దుర్గ, దాసరి యుగంధర్, నరేంద్ర, అద్దెపల్లి సుబ్బారావు, పున్నారావు, జనసైనికుడు తరుణ్ పాల్గొన్నారు.

మంత్రులకు అభినందనలు

ప్రజాశక్తి - రేపల్లె

మద్దుల అంకాలు

ఎంఎల్ఏగా మూడోసారి విజయం సాధించి రెవెన్యూ శాఖ మంత్రిగా నియమితులైన అనగాని సత్యప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి ఆశయంగా టిడిపి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

ఆ అధికారిపై చర్యలు తీసుకోరా?

ప్రజాశక్తి - పంగులూరు

అన్ని అర్హతలున్న కావాలనే వితంతు పెన్షన్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసి నష్టపరిచిన వెల్ఫేర్ అసిస్టెంట్ చొప్పరపు అశోక్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని రామకూరు గ్రామ ప్రజలు కోరుతున్నారు. సచివాలయానికి అతి తక్కువ దూరంలోనే నివసిస్తున్న వితంతువు మిరియాల నాగరాజకు పెన్షన్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అధికారులపై ఎస్సీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన మిరియాల జానకి రామయ్య 2023 జనవరి 31న మరణించాడు. అతని భార్య నాగరాజ వితంతు పెన్షన్‌కు అప్లికేషన్ దాఖలు చేసింది. 2024 జనవరి 1న కొత్త పెన్షన్ల మంజూరు లిస్టు వచ్చినప్పటికీ అందులో ఆమె పేరు లేదు. ఆమెను ఈ కెవైసి చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పెన్షన్ మంజూరు కాలేదు. పెన్షన్ కోసం ప్రతిరోజు ఆమె సచివాలయం చుట్టూ వెల్ఫేర్ అసిస్టెంట్ చొప్పరపు అశోక్ చుట్టూ తిరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా 4నెలలగా పెన్షన్ నష్టపోయింది. స్థానిక ఎంపీడీఒ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. అశోక్‌కు మెమో ఇవ్వటానికి వెళ్ళిన సచివాలయ కార్యదర్శితో ఎంపీడీఒ మ్యాత్యూ బాబు, ఎంపీడీఒ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌పై ఎస్సీ అట్రాసిటీ కేసు పెడతానని బెదరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అద్దంకి ఎఎస్‌డబ్ల్యూఓకు విచారణ బాధ్యతలను అప్పగించింది. ఎఎస్‌డబ్ల్యూఓ విచారణ పూర్తి చేసి జిల్లా అధికారులకు పంపింది. అధికారులు తక్షణమే వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్‌పై చర్యలు తీసుకోవాలని, పెన్షన్ నష్టపోయిన వితంతువు మిరియాల నాగరాజకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హ్యాట్రిక్ లీడర్ కు శుభాభినందనలు...
అందరివాడు.. పేదల పాలిట పెన్నిధి ..సకల సద్గుణ సంపన్నుడు..
అలుపెరగని పోరాటయోధుడు ..
నిరంతర స్నేహశీలి గౌ శ్రీ అనగాని సత్యప్రసాద్ గారు.
రేపల్లె శాసనసభ్యునిగా మూడో పర్యాయం
గెలిచి రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్
శాఖ మంత్రివర్యులుగా పదవీ భాద్యతలు
స్వీకరించిన శుభ సందర్భంగా వారికి
మా హృదయపూర్వక శుభాకాంక్షలు...
డొక్కు వెంకటేశ్వరరావు(అయ్యా)
టిడిపి టౌన్ సెక్రటరీ.
రేపల్లె పట్టణం, బాపట్ల జిల్లా.

అభిమాన ధన్యునికి శుభాకాంక్షలు...
వరుసగా మూడోసారి హ్యాట్రిక్ విజయం
సాధించిన రేపల్లె అభివృద్ధి ప్రదాత..
జనం మెచ్చిన జననేత... గౌరవనీయులు
శ్రీ అనగాని సత్యప్రసాద్ గారు
రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్
శాఖ మంత్రివర్యులుగా పదవీ భాద్యతలు
స్వీకరించిన శుభ సందర్భంగా వారికివే..
మా హృదయపూర్వక శుభాకాంక్షలు..
కమతం శివసుబ్రహ్మణ్యం
టిడిపి నాయకులు
రేపల్లె పట్టణం, బాపట్ల జిల్లా.

ప్రజా విజేత అనగానికి శుభాకాంక్షలు
అకుంఠిత దీక్షతో... ప్రజల మనిషిగా
అనునిత్యం ప్రజలతో మమేకమై....
నేడు రేపల్లె ప్రజాక్షేత్రంలో మూడోసారి హ్యాట్రిక్ తో
తిరుగులేని మెజారిటీ సాధించి...
రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్
శాఖ మంత్రివర్యులుగా పదవీ భాద్యతలు
స్వీకరించిన శుభ సందర్భంగా గౌరవనీయులు
శ్రీ అనగాని సత్యప్రసాద్ గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ...
దేవగిరి శంకర్
జనసేన పార్టీ టౌన్ ప్రధాన కార్యదర్శి
రేపల్లె పట్టణం, బాపట్ల జిల్లా.

మంత్రివర్యులు అనగానికి శుభాకాంక్షలు
ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లో విజయ శంఖారావం
పూరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
సారథ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో..
రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్
శాఖ మంత్రివర్యులుగా పదవీ భాద్యతలు
స్వీకరించిన మా ప్రియతమ నాయకులు రేపల్లె నియోజకవర్గ
అభివృద్ధి ప్రదాత.. ప్రజానేత
గౌ. శ్రీ అనగాని సత్య ప్రసాద్ గారికి
అభినందన శుభాకాంక్షలు తెలియజేస్తూ.....
వారి సారథ్యంలో రేపల్లె నియోజకవర్గం
అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలవాలని కోరుకుంటూ....
పరుచూరి రాఘవ
టిడిపి నాయకులు
బేతపూడి గ్రామం రేపల్లె మండలం
బాపట్ల జిల్లా.

అభిమాన ధన్యునికి శుభాకాంక్షలు....
మీ గెలుపు రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం...
వరుస విజయాలతో మీరు సాధించిన విజయం
అందరికీ స్ఫూర్తిదాయకం...
రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర
అభివృద్ధికి మీరు ఇంకా కృషి చేసి...
అత్యున్నత స్థాయికి ఎదగాలని మనసారా ఆకాంక్షిస్తూ.....
పావులూరి వెంకటేశ్వరరావు
టిడిపి యువ నాయకులు
తాడివాకవారి పాలెం
నగరం మండలం, బాపట్ల జిల్లా

ప్రజా విజేతకు హృదయపూర్వక శుభాకాంక్షలు...
రేపల్లె శాసనసభ్యులుగా రెండుసార్లు
ప్రజలకు సేవలు అందించి...
మూడవసారి హ్యాట్రిక్ సాధించి ..
రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్
శాఖ మంత్రివర్యులుగా పదవీ భాద్యతలు
స్వీకరించిన శుభ సందర్భంగా
మా అన్న.. గౌరవనీయులు.. రేపల్లె రారాజు..
శ్రీ అనగాని సత్యప్రసాద్ గారికి
మా హృదయపూర్వక శుభాకాంక్షలు...
గుడి రమాదేవి అంకసుబ్బారావు
సర్పంచ్, గ్రామపంచాయతీ
కారుమూరు, రేపల్లె మండలం, బాపట్ల జిల్లా

జయ... జయ... జయ... జయహో అనగాని
ప్రజలతో కలిసి సాగుతూ... ప్రతి కుటుంబానికి తోడుగా ఉంటూ... నమ్మిన కార్యకర్తలకు
అండగా నిలుస్తూ, అవరోధాలకు బెదరక...అపజయాలకు అవకాశమివ్వక...
వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించి రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రివర్యులుగా
పదవీ భాద్యతలు స్వీకరించిన శ్రీ అనగాని సత్యప్రసాద్ గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు..
గోలి వెంకటేశ్వరరావు
మాజీ టిడిపి సర్పంచ్,పేటేరు..
రేపల్లె పట్టణం, బాపట్ల జిల్లా.
రెబ్బ కోదండరాం
టిడిపినాయకులు,పేటేరు..
రేపల్లె పట్టణం, బాపట్ల జిల్లా.

హృదయపూర్వక శుభాకాంక్షలు.
అఖండమైన మెజారిటీతో, హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకున్న...
స్వర్ణాంధ్ర రథసారథి.... ప్రజల హృదయాలలో
బలమైన స్థానం పొంది.. వరుస విజయాలతో
విజయభేరి మ్రోగిస్తూ.. హ్యాట్రిక్ సాధించి..
గౌరవ ముఖ్యమంత్రి మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
కేబినెట్ నందు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్
శాఖ మంత్రివర్యులుగా పదవీ భాద్యతలు స్వీకరించిన
మన అందరి ప్రియతమ నాయకులు..
గౌరవనీయులు శ్రీ అనగాని సత్య ప్రసాద్ గారికి
హృదయపూర్వక శుభాకాంక్షలు.
సయ్యద్ అక్తర్ హుస్సేన్
సహాయ వ్యవసాయ సంచాలకులు,
రేపల్లె మండలం, బాపట్ల జిల్లా.